అక్రమంగా రొయ్యల చెరువు పెంపకం

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం పల్లిఊరు జంక్షన్ సమీపంలో అనధికారంగా చెరువులో రొయ్యలు పెంపకం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యలు చెరువుల నుండి వెలుపడే వ్యర్థ పదార్థాలు సముద్ర జలాలలో కలిసిపోయి కలుషితం అయిపోతున్నాయని మత్స్యకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వానికి ఎటువంటి ఆధారాలు లేకుండా నడిపిస్తున్నారని పలువురు విమర్శలు వినిపిస్తున్నాయి అలాగే నగరంపల్లి పంచాయతీ శివరాం పురం దగ్గర కూడా అనధికారంగా రొయ్యలు చెరువులు పెంపకం జరుగుతున్నాయని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ దీపాలు వెలగక అంధకారం..! ఆందోళనలో ప్రజలు

విశాలాంధ్ర-మందస: మండల కేంద్రం మందస మేజర్ పంచాయతీ 9, 10, 11,12 వార్డుల పరిధిలో నివసిస్తున్న ప్రజలకు గ్రామ పంచాయతీ పరంగా వీధి విద్యుత్ దీపాలు వెలగక ఆందోళన చెందుతున్నారు. ఈ వార్డుల పరిధిలో స్థానిక రెండు మరియు మూడు సచివాలయాల కార్యాలయాలు, జంక్షన్ నుంచి కొత్త వీధి కుమ్మరి వీధి యాదవుల వీధి తో పాటు శాసనం వీధి గౌడ వీధిలు ఉన్నాయి. ఈ వీధుల్లో గత వైసిపి ప్రభుత్వ పాలనలో డబుల్ తారు రోడ్డు నిర్మాణం జరిగింది. రోడ్డు మధ్యలో డివైడర్ పనులు జరిగాయి. డివైడర్ మధ్యలో నిర్మాణం జరగాల్సిన సెంటర్ లైటింగ్ పనులు అసంపూర్తిగా మిగిలి పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవల కాలంలో రోడ్డు మధ్యలో దారి పొడవునా సెంటర్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ స్తంభాలకు బల్బులు వేశారు. కానీ గత 15 రోజులుగా విద్యుత్ బల్బులు వెలగకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ లైటింగ్ పనులు ప్రారంభోత్సవం అంశంపై స్థానికంగా వివాదం తలెత్తడంతో విద్యుత్ బల్బులు వెలగడం లేదని బయట ప్రచారంలో ఉంది. రాత్రి పూట ఒక కిలోమీటర్లు పొడవునా వీధిలైట్లు వెలగకపోవడంతో ఈ ప్రాంతమంతా అంధకారం నెలకొంది. దీంతో ప్రజలు రాత్రిపూట రోడ్డు మీద తిరగడానికి భయపడుతూ ఆందోళన చెందుతున్నారు. ఈ దారిలో ప్రజలు నడిచి వెళ్లాలన్న వాహనాలపై ప్రయాణించాలన్న ప్రజలు భయపడుతున్నారు. ఈ రహదారిలో పర్లాకిమిడి సోంపేట బరంపురం వైపు ప్రైవేటు బస్సులు వెళ్తుంటాయి. అనేక మంది పలు రకాల వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. రాత్రిపూట ఈ ప్రాంత మంతా అంధకారంలో ఉండటంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు.ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలోనే పలు రకాల దొంగతనాలు కూడా జరిగాయి.అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగించడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీ ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్ట్‌కు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్రంలోని ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పదివేల రూపాయలు ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్లుగా పెన్షన్లు మంజూరు చేయాలని ఏపీ ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కర్రి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని పెన్షనర్ల భవనంలో ఆదివారం ఏపీ ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తూ ఇప్పటికీ వృద్ధాప్యంలో కూడా జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్న ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పాలక ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవట్లేదని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పింఛన్లతో పాటు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, ఉచితంగా కార్పొరేటర్ హాస్పిటల్లో వైద్యం, ప్రమాద భీమా, రైలు ప్రయాణ సౌకర్యం, తదితర సమస్యలను ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని ఆయన కోరారు.

ఏపీ ఓల్డ్ ఏజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షునిగా శంకర్ రెడ్డి ఎన్నిక : ఏపీ ఓల్డ్ ఏజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీకి జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా కర్రి శంకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే అధ్యక్షులుగా పేడాడ పరమేశ్వరరావు, ఉపాధ్యక్షులు 1) కిల్లి శ్రీనివాస్ రావు 2) అశోక్ కుమార్ రెడ్డి 3) ఎస్. విశ్వేశ్వరరావు,

ప్రధాన కార్యదర్శిగా పివిఎస్ఎన్ మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా 1)ఎన్.చంద్రరావు 2) ఆర్వీ.పట్నాయక్, కోశాధికారిగా బగాది వాసుదేవరావు లతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రశాంతంగా నీట్-2025 పరీక్ష : 41 మంది గైర్హాజరు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) -2025 జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షకు జిల్లాలో నాలుగు కేంద్రాల్లో కలిపి 1568 మందికి గాను 41 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాం పస్ (ఎస్ఎంపురం)లో 720కు 702 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో 240కు 233 మంది, కేంద్రీయ (విద్యాలయం(పెద్దపాడు) లో 128కు 123 మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం)లో 480కు 469 మంది హజరయ్యారు. మ ధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు ఉదయం 11.30 నుంచి 1.30 గంటల మధ్య అభ్యర్థులను అనుమతిం చారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల సరికే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్, జామర్లను ఏర్పాటుచేశారు. ఈ పరీక్షా కేంద్రాలను ఎస్పీ కేవీ మహేశ్వరెడ్డి, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద పరిశీలించారు.

బ్రహ్మోత్సవాలకు ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు ఆహ్వానం



విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలో ఈ నెల 7వ తేదీ నుండి 16వ తేదీ వరకూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు శ్రీకాకుళం ఎంపి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి, కింజరాపు రామ్మోహన్ నాయుడుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన కమిటీ ఆదివారం కరపత్రాన్ని అందచేశారు. ఈ సంధర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి హాజరై, స్వామివారి తీర్థ,ప్రసాదాలు అందుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు, సత్యవరాగ్రహార పురోహితులు, మావుదూరి జగదీష్‌శర్మ బృందం, ఆలయ ధర్మకర్తలు, పొట్నూరు చినవీరభద్రస్వామి, పొట్నూరు కృష్ణప్రసాద్ సోదరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : భగీరథ మహర్షి పట్టుదలతో దివినుండి భువికి లోక కల్యాణం కోసం గంగను తెచ్చిన మహానుభావుడని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర రావు కొనియాడారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ మహర్షి ఎంతో పట్టుదల కలిగిన వ్యక్తి అని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా దివి నుండి భువికి గంగను లోక కల్యాణం కోసం తెచ్చిన మహాను భావుడన్నారు. ఆయన పట్టుదలకు మారు పేరని, అందుకే ఆయన అపర భగీరథుడుగా పేరొందారన్నారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ. అనూరాధ, బిసి సంక్షేమ శాఖ జాతీయ కార్యదర్శి డా. బి. దేవభూషణరావు, ఉప్పర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రామారావు, సెక్రెటరీ గజ్జల మాధవరావు ఉపాధ్యక్షులు పిండి రాము, కలెక్టరేట్ ఎ ఓ సూర్యనారాయణ, బి. సి వెల్ఫర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘాసి గ్రామంలో దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-పోలాకి : మండలంలో దీర్ఘాసి గ్రామంలో వెలసియున్న శ్రీదుర్గమ్మ తల్లి ఆలయ పదవ వార్షికోత్సవ జాతర మహోత్సవ సందర్భంగా ఆదివారం కేంద్ర మంత్రి వర్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు మరియు స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని గ్రామస్తులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం ఆ గ్రామంలో 20 లక్షల రూపాయలతో రోడ్డు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకుడు రోనంకి కృష్ణంనాయుడు, మిరియాపిల్లి వెంకటప్పలనాయుడు, పల్లి సూరిబాబు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జ్యూవెలరీ షోరూంను ప్రారంభించిన కేంద్ర మంత్రి



విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ప్రముఖ బంగారు వజ్రాభరణాల సంస్థ కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ వారు ఆంధ్రప్రదేశ్లోని తమ రెండవ ఎక్స్ క్లూజివ్ షోరూమ్ ను ఆదివారం ఉదయం శ్రీకాకుళం పాలకొండ రోడ్‌లోని గాంధీ పార్క్ పక్కన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు హాజరై ఈ నూతన షో రూమ్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో బంగారు వజ్రాభరణాల ప్రేమికులకు అత్యంత చేరువలో అత్యాధునిక డిజైన్లు, వెరైటీలతో కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ వారు తమ శాఖను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని ఈ ప్రాంత ప్రజలు నూతన వెరైటీ ల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా నచ్చిన మోడల్లను అతి తక్కువ సమయంలో ఇక్కడే కొనుగోలు చేయవచ్చునని అన్నారు. అనంతరం హరికృష్ణ గ్రూపు వ్యవస్థాపకుడు ఘనశ్యామ్ దోకియాల మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం బంగారు ఆభరణాల మార్కెట్ కు అనుకూలంగా ఉందని ఈ ప్రత్యేక షో రూమ్ శ్రీకాకుళం వాసుల అభిమానాన్ని ఆదరణను పొందాలని తమ సంస్థ భారత దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న బంగారు నగల వ్యాపార సంస్థని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ డైరెక్టర్ పరాగ్ షా, కిస్నా ఫ్రాంచైజీ పార్టనర్లు సరిత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు అనంతరం నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి ఆహార పంపిణీ చేపట్టారు.

సంప్రదాయబద్ధంగా తెరవే కవిసమ్మేళనం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక 104 వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు రఘుపాత్రుని వెంకట రమణమూర్తిల ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. డా.బారువ కోమలరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో 13 మంది కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు. కవులు ఐ.యస్.డి ప్రసాద్, వాడాడ శ్రీనివాస్, ఇద్ది పాపయ్య, గోపాలరావు, కిల్లాన శ్రీనివాస్తా, కోమలరావు, యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, యం.ఉపేంద్ర శర్మ, బి.ఉమా మహేశ్వరరావు, లలితారెడ్డి, పూడి జనార్ధన్‌రావు, సోడవరం ఈశ్వరరావు కవితలు చదివి వినిపించారు.

వేసవి సెలవుల్లో బదిలీలు పూర్తి చెయ్యాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉపాధ్యాయ బదిలీలు వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని, మే31తేదీ నాటికి అన్ని కేటగిరీలకు బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి,జి.రమణ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జూన్ 5వ తేదీ తరువాత స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం ప్రారంభమవుతుందని అప్పటికి నూతన ఉపాధ్యాయులు పాఠశాలలో జాయిన్ అయితే ఎన్రోల్మెంట్ డ్రైవ్ కూడా నూతన ఉత్సాహంతో చేపట్టడానికి బాగుంటుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీల కారణంగా ఒక్క పని దినముకూడా వృధా కారాదని, ఆన్లైన్లోనే బదిలీలు జరుగుతున్నప్పటికీ పాఠశాల పనిదినాల్లో బదిలీలు జరగడంవల్ల ఉపాధ్యాయులు కాస్త విద్యార్థుల మీద దృష్టిపెట్టే విషయంలో కొంత సతమతమవుతారన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవని ఇప్పుడు అలా కాకుండా వేసవి సెలవుల్లోనే బదిలీలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు ప్రకటనలో కోరారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

విశాలాంధ్ర-నందిగాం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథపాలకులు సత్తారు ఉదయకిరణ్ ఆదివారం విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. పాఠ్యాంశంకి సంబంధించినవి. చిన్న పిల్లల కథల పుస్తకాలను చదివించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటి వద్దకే విద్య

విశాలాంధ్ర-కవిటి : పదవ తరగతిలో తప్పిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఇంటి వద్దకే వెళ్లి బోధిస్తున్నారు. ఏ సబ్జెక్టు తప్పితే ఆ ఉపాధ్యాయుడు పిల్లల ఇంటి వద్దకు వెళ్లి వారికి ఆ సబ్జెక్టును బోధించి ఉత్తీర్ణులుగా చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకోవడంతో వారు ఆయా సబ్జెక్టులను బోధిస్తున్నారు. కవిటి మండలం ముత్యాలపేటలో జీవశాస్త్రంలో తప్పిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు వెళ్లి బోధించడం జరిగింది.

వైసీపీలోకి పలువురు చేరిక

విశాలాంధ్ర-ఆమదాలవలస : పట్టణంలోని పలువురు యువకులు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. గత ఎన్ని కల్లో స్వతంత్ర అభ్యర్థితో కలసి పనిచే సిన ఆమదాలవలస మున్సిపాలిటీ 14వ వార్డ్ (బజె నాయుడు కాలనీ), 8 వ వార్డు(గేట్) లకు చెందిన 25 మంది యువకులు ఆమదాల వలస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతాడ రవికుమార్ అద్వర్యం లో వైస్సార్సీపీ పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. వారిని నియోజకవర్గ సమన్వ యకర్త డాక్టర్ చింతాడ రవికుమార్, మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఆమ దాలవలస పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, జిల్లా ఇంటెలెక్చుల్ ఫోరమ్ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వరరావు, ఇతర వైస్సార్సీపీ నాయకు ల అద్వర్యం లో కండువా వేసి పార్టీలోకి సాదరం గా ఆహ్వా నించడం జరిగింది, ఈ సందర్భంగా వైస్సా ర్సీపీ గెలుపే లక్ష్యంగా అందరం కలసికట్టు గా పనిచేస్తాం అని చింతాడ రవికుమార్ అన్నా రు. పార్టీ లో చేరిన 14 వార్డ్ కి చెందిన అన్నెపు సంజయ్ కుమార్, కూన రాజశేఖర్, పిన్నింటి పవన్, తిర్లంగి కిరణ్, ఎన్ని మురళి, యెన్ని రామ కృష్ణ, గురుగుబెల్లి శ్రీను, సింగుపురం కన్నయ్య, బాలాజీ, తమరాపు పవన్, జామి సాగర్, సీపాన ఉమా, సీపాన శ్రీనివాసరావు దివ్వెల వాసు, ఎనిమిదో వార్డ్ కి చెందిన బి మహేష్, చిన్ని, సాయి, కిరణ్ తదితరులు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి



విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని జరజాం జంక్షన్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో గాయపడిన రణస్థలం వేల్పురాయి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు బాలి సింహాచలం (65) శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింహాచలం, అదే గ్రామానికి చెందిన అడపా శ్రీనుతో కలిసి శ్రీకాకుళం మోటారు బైక్పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో శ్రీను శనివారం మృతిచెందాడు. మృతుడు సింహాచలంకు భార్య కాంతారత్నం, కుమారులు అజిత్ కుమార్, రాంబాబు, రత్నాకరరావులు ఉన్నారు. కాగా, కాంతారత్నం గతంలో ఎంపీటీసీగా పనిచేశారు. ఒకే ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందడంతో గ్రామంలో విషాధ ఛాయలు అలముకున్నాయి.

మామిడి గోవిందరావుని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా నూతన డి.సి.సి.బి చైర్మన్

విశాలాంధ్ర-హిరమండలం/ పాతపట్నం : ఆదివారం సాయింత్రం పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో శాసనసభ్యులు వారి కార్యాలయంలో ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో నూతన డి.సి.సి.బి చైర్మన్ గా నియమితులైన సందర్భంగా శివాల సూర్యం పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం ఎమ్మెల్యే మామిడి మాట్లాడుతూ తెదేపా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని ముందుండి నడిపించిన కార్యకర్తలే అధినేతగా గుర్తించబడుతున్నారు అన్న దానికి నిదర్శనంగా శ్రీకాకుళం జిల్లా నూతన డి.సి.సి.బి చైర్మన్ గా ఒక సామాన్య కార్యకర్త అయిన మిమ్మల్ని నియమించడంలో నేను సంతోషం వ్యక్తం చేస్తున్నాను అని అన్నారు. అలాగే పార్టీ అప్పచెప్పిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి చేపట్టిన పదవికి పేరు తెచ్చేలా పనిచేయాలనిఎమ్మెల్యే గోవిందరావు నిర్దేశం చేశారు.

వ్యాధిగ్రస్తునికి హాండ్స్ టుగెదర్ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామానికి చెందిన బత్సల క్రిష్ణమూర్తి కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. నిరు పేద కుటుంబానికి చెందిన వ్యాధిగ్రస్తునికి భావనపాడు గ్రామానికి చెందిన హ్యాండ్స్ టుగెదర్ ట్రస్ట్ సంఘ సభ్యులు వైద్య ఖర్చులు నిమిత్తం 40,000 రూపాయలు ఆదివారం ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గరిక ఆదినారాయణ, దూపాన కూర్మారావు, దుమ్ము కోదండరావు, తిమ్మల గణపతి తదితరులున్నారు.

ప్రారంభానికి ముందే శిథిలమైన రోడ్డు

- ఈసర్ల పేట పనులలో నిర్వహణ లోపం

- పట్టించుకోని సాంకేతిక సిబ్బంది

విశాలాంధ్ర-ఆమదాలవలస : పంచాయతీరాజ్ పరిధిలో గ్రామీణ అభివృద్ధి కోసం రహదారుల నిర్మాణానికి ఉప ముఖ్యమం త్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఎం జి ఎన్ఆర్ ఈజీఎస్ ఉపాధి నిధులను విడుదల చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టేం దుకు ఉపాధి నిధులు మంజూరు చేశారు. ఎస్ ఆర్ సి పేట పంచాయతీ పరిధి ఈసర్ల పేటలో ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ లోపంతో పను లు ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. 16 లక్షల రూపాయలతో స్మశానానికి రహ దారి నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే నిధులు మం జూరుకు కృషి చేశారు. సిమెంట్ రహదారి నిర్మా ణంలో 12 అడుగులకు తగ్గకుండా నిర్మించాలని మౌఖిక ఆదేశాలు కూడా జారీ చేశారు. పలు సమావేశాల్లో ఇంజనీరింగ్ విభాగం ప్రతినిధులు, సిబ్బంది కలిసి అంచనాలు రూపొందించారు. ఉపాధి నిధులు కనుక క్వాలిటీ అప్రూవల్ జరిగి నంతవరకు 20 శాతం నిధులు విడిచి పెడతారు అన్న ఉద్దేశంతో స్థానికంగా జరిగే పనులకు అంచ నాలు కూడా అధికంగానే రూపొందించారు. పాల కులు ప్రభుత్వం స్థానికులకు ఇంతటి వెసులుబా టు కల్పించినప్పటికీ నిర్మాణాల్లో లోపం పర్యవే క్షణలో అలసత్వం వెరసి పనులు ప్రభుత్వ లక్ష్యా న్ని చేరుకోవడం లేదు. దీంతో ప్రజాధనం వృధా అవుతుంది.

ఈసర్ల పేటలో ఫనులలో నిర్వహణ లోపం... ఈసర్ల పేట పరిధిలో స్మశానానికి రోడ్డు పనులు నిర్వహించాలని గ్రామస్తుల కోరిక మేరకు ప్రభు త్వం పదహారు లక్షల నిధులను మంజూరు చేసింది. పనులలో నిర్వహణ లోపం కారణంగా ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటు న్నాయి. ఇదిలా ఉండగా ఎనిమిది అడుగులు రోడ్డు మాత్రమే వేశారు. ప్రొటెక్షన్ వాళ్ల నిర్మాణం చేయకపోవడంతో రోడ్డు కిందికి జారుకుంది. ఇంజ నీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే పనుల నిర్వహణలో గ్రామం రెండు వైపుల నుంచి స్మశానానికి వెళ్లే దారిని కలిపే దగ్గర డ్రైన్ మాత్రమే ఉంచారు. పక్కనే ఉన్న చెరువుకు నీరు సరఫరా చేసే కాలువ మధ్య ను ఉండటంతో పైపు కల్వర్టు నిర్మించేందుకు ఇరిగేషన్ అధికారులతో చర్చలు జరిపారు. ఆ కల్వర్టు కూడా అర్ధాంతరంగా నిలిచిపోయింది. లాక్ వాల్ లేకుండా నిర్మాణం చేయటంతో రోడ్డు కిందికి సింక్ అవుతుంది. లాక్ వాల్ ఉన్న ప్రాంతం లో కూడా రోడ్డు కలవకపోవడంతో బీటలవారిన పరిస్థితి ఏర్పడింది. పక్కనే చెరువు ఉన్నప్పటికీ క్యూరింగ్ సక్రంగా చేయలేదన్న విమర్శలు ఉన్నా యి. బిల్లులకై ఎంపర్లాడే గుత్తేదారు నిర్మాణాలలో నిబంధనలు పాటించకపోవడం పై గ్రామస్తులు సంబంధిత పాలకుల వద్ద మొరపెట్టుకున్నారు. రెండు విడతలుగా మూడున్నర లక్షలు రెండో విడత మూడున్నర లక్షలు యం బుక్ రికార్డు చేశారే తప్ప పనులలో నాణ్యతలను పరిశీలించే పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని సాంకేతిక సిబ్బంది... పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా యి అప్పటికి సాంకేతిక సిబ్బంది మాత్రం పర్య వేక్షించి సమస్యను పరిష్కరించే పాపాన పోలేదని స్థానికులు అంటున్నారు. మండల ఇంజనీరింగ్ అధికారి కనీసం ఏ ఒక్క పనిని కూడా పర్యవేక్షణ చేయటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్న నేపథ్యంలో స్థా నికంగా ఉండే సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పనులు పరిశీలిస్తున్నారని సమస్యలు ఉన్నచోట కు వెళ్లి పరిష్కరిస్తున్నామని ఉన్నారు. మార్చి నెలలో ఈసర్ల పేట రోడ్డు నిర్మాణ సమయంలో రోజులపాటు వర్షం బీభత్సంగా కురిసిందని ఈ వర్షం కారణంగానే రోడ్డు సింక్ అయిందని సాంకేతిక అధికారి తెలిపారు. మార్చి నెలలో ఇరవై ఒక్క రోజులపాటు వర్షం ఎంత శాతం నమోదయిందో రెవిన్యూ రికార్డుల్లో పొందు పరుస్తారు. ఆ విషయం కూడా గ్రహించకుండా వర్షానికి కొట్టుకుపోయింది అని చెప్పటం విశేషం. ఉన్నతాధికారులు పరిశీలన చేసి పనులలోని లోపాలను సరిదిద్ది ప్రభుత్వ లక్ష్యాలను చేరుకో వలసిన అవసరం ఉంది.

కలమట ను కలిసిన నూతన డిసిసిబి ఛైర్మన్ శివ్వాల

విశాలాంధ్ర-కొత్తూరుకొత్తూరు: మండలం మాతలలో గల కలమట క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు , పాతపట్నం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణ మూర్తి ని ఇటీవల నామినేటెడ్ పదవుల్లో భాగంగా డీసీసీబీ ఛైర్మన్ గా నియమితులైన శివ్వాల సూర్యం మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా అధ్యక్షులు కలమట మాట్లాడుతు పార్టీ గౌరవించి అప్పచెప్పిన బాధ్యతలు విజవంతంగా నిర్వర్తించి చేపట్టిన పదవికి పేరు తెచ్చేలా పనిచేయాలని దిశనిర్దేశం చేసారు.

జన జాతర ...

- రెండోరోజు అంచనాలకు మించిన జనం
- కిక్కిరిసిన బారువ గ్రామం
- ఘనంగా ముగిసిన బీచ్ ఫెస్టివల్

బీచ్ ఫెస్టివల్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-సోంపేట : బారువ తీరంలో ప్రభుత్వం నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ ఆదివారంతో ఘనంగా ముగిసింది. రెండవ రోజు ఆదివారం అంచనాలకు మించి పర్యాటకులు పోటెత్తడంతో బారువ తీరమే కాకుండా తీరానికి వెళ్లే రహదారులన్నీ ఇసుకవేస్తే రాలనంతగా జనంతో కిక్కిరిసిపోయాయి. పర్యాటకులను నియంత్రించడం పోలీసు యంత్రాంగానికి సవాలుగా మారింది. జిల్లా కలెక్టర్ దినకర పుండ్కర్ , జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన అహ్మద్ ఖాన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో రెండు రోజులుగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ ఈ ప్రాంతానికి ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెట్టింది. ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటిసారిగా సోంపేట మండలం బారువాలో నిర్వహించిన ఈ ఫెస్టివల్ కార్యక్రమం ఎలా ఉంటుందో చూసి ఆనందించాలన్న ఆలోచనతో బారువతో పాటు సోంపేట కంచిలి కొర్లం హరిపురం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో జనం ఇక్కడికి చేరుకున్నారు. బీచ్ ఫెస్టివల్ కు సంబంధించి పూర్తిస్థాయిలో కానప్పటికీ కొంతమేరకు కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో వాటిని చూసి పర్యాటకులు ఎంతగానో ఆనందించారు. బడ్జెట్ తో కూడిన ఫెస్టివల్ కార్యక్రమం కావడంతో అధికార యంత్రాంగం పరిమితంగానే కొద్దిపాటి కార్యక్రమాలను మాత్రమే రూపొందించింది.

- స్టాల్స్‌కే పరిమితం...

బీచ్ ఫెస్టివల్‌లో ఏదో చూదాలని ఎంజాయ్ చేయాలని చాలా పెద్ద సంఖ్యలో వచ్చిన పర్యాటకులకు కొంత నిరాశ తప్పలేదు. బీచ్ లో స్టాల్స్ మాత్రం విరివిగా ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి మాదిరిగా ఆదివారం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమం జరగనుంది. ఇది ఇలా ఉండగా శనివారం రాత్రి ప్రముఖ కళాకారుడు ఎస్ ఎస్ వి కొండేపూడి సినీ గీతాల ఆలాపన కార్యక్రమం కనుల పండుగ సాగింది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ డాక్టర్, జిల్లా కలెక్టర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మద్ అహ్మద్ ఖాన్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, అనేకమంది జిల్లా అధికారులు హాజరు కావడంతో ఈ కార్యక్రమానికి విశేష ప్రాధాన్యత చేకూరింది.

- అలరించిన వాటర్ గేమ్స్...

ఆదివారం ఉదయం పర్యాటకులను వాటర్ గేమ్స్ ఎంతగానో అలరించాయి. బోట్ షికార్ ద్వారా సముద్రంలో చాలామంది ఎంజాయ్ చేశారు. అలాగే బీచ్ లో నిర్వహించిన క్రీడలు కూడా కనువిందు చేశాయి.

- బారువ జంక్షన్ వరకే బస్సులు...

ఆదివారం పర్యాటకుల రద్దీ విపరీతంగా ఉండడంతో పోలీస్ అధికారులు మధ్యాహ్నం నుంచే బారువ గ్రామంలోనికి రావాల్సిన బస్సులను జంక్షన్ వరకే పరిమితం చేశారు. బస్సుల ద్వారా చేరుకున్న ప్రజలు జంక్షన్ లో దిగి సుమారు రెండున్నర కిలోమీటర్లు బీచ్ వరకు నడవడం కొంత ఇబ్బందికి గురయ్యారు. కార్లు జీపుల్లో వచ్చే పర్యాటకులు మాత్రం అధిక రద్దీ వలన ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు.

ఫెస్టివల్‌కు హాజరైన పర్యాటకులు

- పూర్తి వినోద కార్యక్రమాలతో నిర్వహించాలి...

ఇకపై నిర్వహించే బీచ్ ఫెస్టివల్ పూర్తి వినోద కార్యక్రమాలతో పర్యాటకులకు ఆనందం పంచాలని అనేకమంది కోరుతున్నారు. ఈ రెండు రోజులు ఇక్కడ జరిగిన ఫెస్టివల్ కేవలం ఒక ట్రయల్ రన్ మాదిరిగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఇంతకన్నా మెరుగైన రీతిలో అన్ని కార్యక్రమాలు రూపొందించి పర్యాటకులు సంబరపడేలా నిర్వహించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

- ఏర్పాట్లు భేష్...

బీచ్ ఫెస్టివల్ లో సౌకర్యాల విషయంలో మాత్రం అధికారి యంత్రాంగం పర్యాటకులకు సౌకర్యాలను కల్పించడంలో నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమని పలువురు పేర్కొంటున్నారు. బీచ్ లో ఎక్కడ ఎటువంటి చెత్తాచెదారాలకు తావు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం గొప్ప విషయం అని పలువురు పేర్కొంటున్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో పరిచయం చేసినందుకు జిల్లా ప్రజా ప్రతినిధులకు, జిల్లా కలెక్టర్ తో పాటు ఉన్నతాధికారులకు, స్థానిక అధికారి యంత్రాంగానికి బారువ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్దాన జీడి రైతులను ఆదుకోవాలి

జనసేన నాయకులు డిమాండ్

విశాలాంధ్ర -వలాన: ఉద్దానం జీడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన నాయకులు హరీష్ కుమార్ శ్రీకాంత్, కోన కృష్ణారావులు అన్నారు. జీడి పంట దిగుబడి జీడి రైతుల అవస్థలపై వచ్చిన కథనాలకు స్పందించిన పలాస నియోజకవర్గ జనసేన నాయకులు ఆదివారం ఉద్దానంలో పలు ప్రాంతాలలో పర్యటించి రైతుల సమస్యలను, జీడి పంట దిగుబడి తగ్గిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ధర 13,000 ధర వస్తున్నప్పటికీ దిగుబడి అనూహ్యంగా పడిపోవడం నష్టాలు చవిచూస్తున్నామని నర్సమ్మ అనే మహిళ రైతు జనసేన నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. జీడి పరిశోధనా కేంద్రం నుంచి పరిశోధకులు వచ్చి భుజి పురుగు నుండి కానీ మిగతా నివారణ చర్యలు వ్యవసాయదారులకు సూచించాలని మెట్టూరు అప్పారావు అభిప్రాయ పడ్డారు. దిగుబడి తగ్గిపోయి పెట్టుబడి పెరిగిన కారణంగా కనీస ధర 16,000 వస్తే తప్ప నష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితి లేదని రైతు పల్లేటి హేమసుందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వంశీ చౌదరి, గిరీష్, ఉదయ్, శంకు శ్రీకాంత్ శ్రీను, లాండ గిరి బాబు, లక్ష్మణ్, ఈశ్వర్ మరియు రెయ్యి హేమసుందర్ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయం ప్రతిష్ట

పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి /కోటబొమ్మాళిం: కోటబొమ్మాళి మండలం సరియాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ఆదివారం వైభవంగా ప్రారంభం అయింది. స్థానిక ఆగమశాస్త్ర పురోహితులు ప్రతిష్ఠాపనకు సంబంధించిన పూజలు నిర్వహించారు. కోటబొమ్మాళి మండలం మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా కేంద్ర విమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఆయనతోపాటు కోటబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణంలో వెంకటేశ్వర కళ్యాణ్ మండపంలో అక్కులపేట జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న 1985 బి1986 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్వపు విద్యార్థుల బ్యాచ్ కలయిక ఆదివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారికి బోధించిన గురువులకు సన్మానిం చారు. బి.షణ్ముఖరావు ఉపాధ్యాయులు విద్యా ర్థులు కలయిక కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వ హించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసు కుని అందరూ ఆనందంతో రోజంతా గడిపారు. చదువుకున్న పాఠశాలకు మనమంతా కలిసి ఏదో ఒక సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ ఎంతో కొంత డబ్బులను సేకరించి బ్యాంకులో వేసుకుని సేవా కార్యక్రమాలు ఎవరికైనా ఏ సహకారం చేయాల న్నా ఆ డబ్బులు వినియోగించుకోవాలని తీర్మా నించారు.

డైమండ్ గోల్డ్ జ్యువెలరీ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర- హిరమండలం/ పాతపట్నం : శ్రీకాకుళం నియోజవర్గ కేంద్రానికి చెందిన పివిఆర్ శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు శ్రీకాకుళం పట్టణంలో నూతన కిసనా డైమండ్ గోల్డ్ జ్యువెలరీ షాప్ ప్రారభోత్సవ కార్యక్రమంలో కేంద్ర పౌరవిమాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట నియోజకవర్గం శాసనసభ్యులు బగ్గు రవణమూర్తితో పాటు కలిసి పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు అందరి తో కలసి ఆదివారం పాల్గొన్నారు. వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు గా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా దీవించారు.

శ్రీశ్రీశ్రీ చింతలపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/ పాతపట్నం: ఆదివారం పాతపట్నం మండలం తెంబూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ చింతల పోలమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లో పాత పట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే గోవిందరావు నిర్వహించి అనంతరం గ్రామ పెద్దలకు గ్రామ ఉత్సవాలకు రూ.25వేలు విరాళంగా అందించారు. అలాగే గ్రామంలో పలువురు ఇంటికి పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు వెల్లి వారి ఆతిథ్యం స్వీకరించారు.

పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-నందిగాం : స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో చదువుకున్న 2009-11 బ్యాచ్‌కు చెందిన ఇంటర్మీడియట్ (హెచ్ఎసీ) విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. చదువుకున్న సమయంలో ఆడిన ఆటలు, పాడుకున్న పాటలు నెమరువేసుకున్నారు. సినీ గీతాలకు నృత్యాలు చేశారు. అనంతరం అధ్యాపకులు సుధాకర్, దేవరాజు, పాపయ్య, లను ఘనంగా సన్మానించి సత్కరించారు.

పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల దండు గోపాలపురం నందు 2009-10 విద్యాసంవత్సరపు10వతరగతి విద్యార్థుల ఆత్మీయకలయిక సమావేశం ఆదివారం నిర్వహించారు. వివిధ వృత్తులు, ఉద్యోగాలలో స్థిరపడిన 46 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులును ఆహ్వానించారు. ముఖ్యఅతిథిగా రోణంకి.గోవిందరావు %ఖాూా% అడిషనల్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ హాజరయ్యారు. ఆంగ్ల ఉపాధ్యాయులు టి.భాస్కరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో, పాఠశాల ఆవరణలో కల జాతీయనాయకుల విగ్రహాలకు అతిథులు పూలమాలలో వేసి నివాళులర్పించారు. పూర్వ ఉపాధ్యాయులు ధనుంజయరావు, దాశరథి, పాపారావు, విజయకుమార్, లోకేశ్వరరావు, చిన్నవాడు, శ్రీనివాసరావు, మోహనరావు, శ్యామలరావు, రాము, భాస్కరరావు, ప్రకాశరావు, నగేష్ లకు పాదపూజచేసి, జ్ఞాపికలు, భహుమతులు అందచేసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయునిగా తన అనుభవాలను వివరించారు. కృషి , పట్టుదల, నిరంతర శ్రమ ఉంటే సాధ్యము కానిది ఉండదు అని ఉద్బోధించారు. పాఠశాల కేవలం నేర్చుకునే ప్రదేశం కాదు, మీలో ఆత్మీయ అనుబంధాలను పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమములో పూర్వ విద్యార్థులు కరగాన ప్రసాద్, బొమ్మాళీ మల్లేష్, డొక్కరి లక్ష్మణ రావు, నాయినిపత్రుని ప్రసాద్, నరేష్, లావణ్య ,శ్రావణి పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్‌పై కళింగపట్నం విజయం

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస కళాశాల మైదానంలో జరుగుతున్న ఎమ్మెల్యే కప్ టి20 క్రికెట్ మ్యాచ్ ఆదివారం కళింగపట్నం ఎస్ఎంఎస్ ఎలివేన్ కృష్ణాపురం జట్లు మధ్య జరిగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న కళింగపట్నం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 169 పరుగులు చేసింది. రెండోసారి బ్యాటింగ్కు దిగిన ఎస్ఎంఎస్ ఏలివెన్ కృష్ణాపు రం జట్టు 170 పరుగులు లక్ష్యంతో బరిలో దిగిం ది. హోరా హోరీగా జరిగిన మ్యాచ్లో ఒక్క రన్ తేడాతో కళింగపట్నం విజయం సాధించింది. సిఎం సిసి ప్రతినిధి తమ్మినేని విద్యాసాగర్ నేతృత్వంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్లో ఈ వారం జరి గిన మ్యాచ్ కి అతిధిలుగా లాయర్ తమ్మినేని అన్నం నాయుదు అలాగే శ్రీ వాణి స్కూల్ ప్రిన్సి పాల్ హాజరై విజేతలకు బహుమతులు ఎందుకు ఇచ్చారు.

ఈనెల 6నుండి శ్రీ గ్రామ దేవతల సిరిమాను ఉత్సవాలు

విశాలాంధ్ర- నరసన్నపేట/ శ్రీకాకుళం : ఈ నెల 6వ తేదీ నుండి పాత శ్రీకాకుళంలోని కునుకుపేట, కొత్తపేట, బాదుర్ల పేట, హరిజన వీధి, మావూరు వీధి, చాకలి వీధి, కర్ణపు వీధి, బాలయ్య పేట, దండి వీధి, కుందనపు పేట, నక్క వీధి, దెశెల్ల వీధుల్లో శ్రీ గ్రామ దేవతల సిరిమాను ఉత్సవాలు నిర్వహించబడతాయని సిరిమాను ఉత్సవాల అధ్యక్షులు, రిటైర్ట్ తహశీల్దార్, డి.వి.దేవ్ తెలిపారు. ఆదివారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన సనప వేయి కార్యక్రమంతో ప్రారంభమైన సిరిమాను ఉత్సవాలు వచ్చే జూన్ నెల 10వ తేదీన నిర్వహించే సిరిమాను ఉత్సవంతో ముగుస్తుందని అన్నారు. సుమారు 29రోజుల పాటు నిర్వహించే ఈ సిరిమాను ఉత్సవాల కార్యక్రమం పోలీసుల సహకారంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ గ్రామ దేవతల సిరిమాను ఉత్సవాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన...సాగునీటి వనరులు..

రైతులకు అందని ద్రాక్షల హామీలు..

శిథిలావస్థలో దామోదర్ సాగర్ స్లూయిస్..

కలగా మిగిలిన జంతికొండ రిజర్వాయర్...!

అన్నదాతలైన రైతుల భూములకు పుష్కలంగా సాగునీరు వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి లేక ప్రతి ఏడాది సాగునీరు కోసం అన్నదాతలు ఆక్రందన చెందుతున్నారు. పంట సాగుబడి పుష్కలంగా రావలసి ఉన్నప్పటికీ సాగునీటి వనరులు అభివృద్ధి లేక పంట చేతికి అందే పరిస్థితి అందనంత దూరంలో ఉండిపోతుంది. దీంతో ఏటా రైతులు సాగునీరు సక్రమంగా అందక ఆందోళన చెందుతున్నారు. చిన్న నీటి వనరులను వినియోగించుకుంటే భారీగా ప్రయోజనాలు పొందవచ్చు. భూ సేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా తక్కువ వ్యయం తక్కువ సమయంతో సులువుగా నిర్వహణ చేసుకోవడానికి వీలున్నవి చిన్న నీటి వనరులే. ముప్పై ఐదేళ్లు టిడిపి, ఐదేళ్ల వైసిపి పాలనలో ఆయా పార్టీల నాయకులు చిత్తశుద్ధితో వీటిపై దృష్టి సారించకపోవడం మంచినీటి వనరులు ఇప్పటికీ రైతులకు కలగా మిగిలిపోయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

విశాలాంధ్ర-పలాస/మందస :ఎన్నికల హామీలకే సాగునీటి వనరులు పరిమితమయ్యాయి. మహేంద్ర తనయ పర్వతాలను ఆనుకొని ఉన్న మందస మండలంలోని సాగు నీటి వనరులను అభివృద్ధి చేస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామవుతాయి. జలాశయాల గర్భాలు, ఇసుక మేటలు పొదలతో నిండిపోవడంతోపాటు నిర్వహణ కరువై మరమ్మతులకు గురయ్యాయి. దీంతో నానాటికి జలాశయాల్లో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి రైతులకు సాగునీటి కష్టాలు తప్పటం లేదు. పంట సాగుబడి పుష్కలంగా రావాల్సి ఉన్నప్పటికీ సాగునీటి వనరులు అభివృద్ధి లేక పంట చేతికి అందే పరిస్థితి అందనంత దూరంలో ఉండిపోతుంది.

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం : రైతాంగ సమస్యలు పరిష్కరించడంలోను, సాగునీటి వనరుల అభివృద్ధి చేయటంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిసన్నారని ఎప్పటికైనా రైతుల సమస్యలను పరిష్కరించి సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని అధికారులను ప్రజా ప్రతినిధులను రైతులు కోరుతున్నారు.

కళింగ దళ్ ప్రాజెక్ట్ : ఇది ఒడిశా సరిహద్దుకు సమీపంలోని కురుడాలు గిరిజన గ్రామం వద్ద ఉన్న కళింగదళ్ రిజర్వాయర్ ఉంది. దీనికి కుడి, ఎడమ కాలువలు పరిధిలో సుమారు 2000 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ ప్రధాన కాలువలు.పిల్ల కాలువలు మరమ్మతులు లేకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ప్రధాన సూయిస్ లు 35 ఏళ్ళ నుంచి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనిలో ఏడాది పొడుగున నీరు ఉంటుంది. ఈ రిజర్వాయర్ ను అభివృద్ధి చేస్తే మరింత నీటి సామర్థ్యాన్ని పెంచుకొనే వీలుంటుంది. జలాశయం గర్భంలో ఇసుక మేటలు, పొదలు, విపరీతంగా పెరిగిపోయాయి. గట్లు పాడైపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. అభివృద్ధి చేస్తామన్న నాయకుల హామీలు గాలిలో కలిసిపోతున్నాయి.

దామోదరసాగరం రిజర్వాయర్ : ఇది నర్సింగపల్లి పంచాయతీలోని దేవుపురం వద్ద దామోదర సాగరం రిజర్వాయర్‌ను రూ.6కోట్ల రూపాయల వ్యయంతో 2003లో నిర్మించారు. రిజర్వాయరుకు ఇంత వరకు కుడి ఎడమ కాలువలు నిర్మించలేదు. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. 1200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా రైతులకు పూర్తిగా సాగునీరు అందడం లేదు. దీంతో పిడి మందస మధ్య, వాసుదేవుపురం, ఛత్రపురం, రాజపురం, నర్సింగపురం, కుంటికోట గ్రామాల పరిధిలో ఉన్న సాగు భూములు బీడు భూములుగా మారిపోతున్నాయి.

బిడిమి జంతి బంధ : మందస, వజ్రపుకొత్తూరు మండలాల సరిహద్దు ఉద్దానం. ప్రాంతంలో బాహడపల్లి సమీపంలో బీడిమి జంతి బంద ఉంది. ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణానికి 35 ఏళ్ల ప్రతిపాదనలతోనే కాలం గడుస్తోంది. ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణానికి ఎన్నోసార్లు నిధులు మంజూరు అయినా టెండర్ దశకు చేరుకునే సరికి టెండర్ వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రిజర్వాయర్ కోసం ఉద్దానం రైతులు ప్రజలు ఎన్నో ఆశలు పడినప్పటికీ వారి ఆశలు ఆవిరి అవుతున్నాయి దీనిని రిజర్వాయర్ గా మార్చితే బహడపల్లి, రాంపురం, బేతాళపురం, సువర్ణపురం, నారాయణపురం, సరియాపల్లి తదితర పంచాయితీలలో వేలాది ఎకరాల భూములు సాగులోకి వస్తుంది.

సంకుజోడు : మకరజోల వద్ద ఉన్న సంకుజోడు చెరువు గర్భం విస్తీర్ణం 300 ఏకరాలు. ఈచెరువును మినీ రిజర్వాయరుగా నిర్మించాలని దశాబ్దాల తరబడి రైతులు కోరుతున్నారు. ఇక్కడ రిజర్వాయర్ నిర్మిస్తే మకర జోల, కమలాపురం, కుంటికోట, హరిపురం, బాలిగాం, భిన్నల మదనాపురం, వరదరాజపురం, గోవిందపురం, రాజపురం, అంబుగాం, తాళబద్ర గ్రామాల పరిధిలో సుమారు 1500 ఎకరాలు భూములకు సాగునీరు అందుతుంది. కాని రైతాంగం ఆశలు నెరవేరక సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు.

సునాముది : మండలంలో ప్రధాన సాగునీటి వనరు సునాముది గెడ్డ. మహేంద్ర గిరుల్లో ప్రారంభమైన గెడ్డ మందస, సోంపేట మండలాల మీదుగా సుమారు 25 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ఆనకట్ట శిథిలావస్థకు చేరి నీరు వృథా అవుతోంది. దీనికి ప్రధాన సాగునీటి కాలువలు 12 ఉన్నాయి. పిల్ల కాలువలు 60 వరకు ఉన్నాయి. సునాముది కాలువలకు మహేంద్రగిరుల నుంచి నీరు అందుతుంది. ఈ కాలువలు ద్వారా 12000 ఎకరాలు భూములకు సాగునీరు అందుతుంది కానీ కాలువలు మరమ్మతులు లేక రైతుల భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. కాలువల్లో ఇసుక దిబ్బలు పిచ్చిమొక్కలు పేరుకు పోవడం, కాలువలు ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు అందక రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కాలవలు మరమ్మతులు కోసం ఆయకట్టు రైతులు మూడు దశాబ్దాలు నుంచి కోరుతున్నారు. కాని రైతుల సమస్యలు కోసం పట్టించుకోవడం లేదు.

దబారు సింగి జలాశయం : 25 ఏళ్ళ కిందట గోపాలసాయి గిరిజన గ్రామం వద్ద నిర్మించిన దబారు సింగి జలాశయం దయనీయ స్థితిలో ఉంది. గిరిజన భూములకు సాగులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్మించిన ఈ రిజర్వాయర్ సగం పనులు జరిగాక నమూనాను మార్చారు. కాలువ నిర్మాణాన్ని మధ్యలో ఆపేయడంతో అప్పట్లో వెచ్చించిన రూ.20. లక్షలు రూపాయలు వృథా అయ్యాయి. ఈ ప్రాజెక్టుకు రెండు స్లూయిస్ లు నిర్మించి, రెండు కాలువలు నిర్మించాలి. కాని కేవలం ఎడమ కాలువతో పాటు స్లూయిస్‌ను ఒక్కటే నిర్మించారు. కుడి కాలువతో పాటు మరో స్లూయిస్ ఇంత వరకు నిర్మించలేదు. దీంతో ఈ రిజర్వాయరు కింద బాగాన ఉన్న భోగబంద, కొంకడాపుట్టి గిరిజన పంచాయితీలకు చెందిన 15 గిరిజన గ్రామాల రైతుల భూములకు సాగునీరు అందడం లేదు. కుడికాలున నిర్మించాలని గిరిజన రైతుల గోడు కంఠ శోషగా మిగిలిపోయింది. ఈ రిజర్వాయర్ నీరు గిరిజనేతర రైతుల భూములకు మాత్రమే అందుతుంది.

రిజర్వాయర్ గా నోచుకోని గోపాల సాగరం : ఇది మందస గ్రామంకు ఆనుకొని ఉన్న అతి పెద్ద గోపాలసాగరం చెరువు. గర్భం విస్తీర్ణం 150 ఎకరాలు, ఈ చెరువు నీరు మందస, జిల్లుండ, ఉమాగిరి, పితాతొలి, ఖైరి సారంగపురం, సిద్ధగాం, సొండిపూడి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన 1000 ఎకరాలకు సరఫరా అవుతుంది. గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయర్ గా నిర్మించాలని 35 ఏళ్ళు నుంచి. రైతులు కోరుతున్నారు. కాని రైతులు చిరకాల వాంఛ నేటికీ నేరవేరలేదు. ఈ చెరువు కాలువలు మరమ్మతులు లేక రైతులు భూములకు సాగునీరు అందడం లేదు. దీనిని అభివృద్ధి చేస్తే మందసతో పాటు పరిసర పంచాయితీల అయకట్టు భూములకు నీరందించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఈ సాగరంలో ఇసుక మేటలు, ముళ్ల పొదలతో నిండి నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. దీనిపై అధికారులు శీత కన్ను వేయడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం లోనైనా ఈ సాగునీటి వనరులకు మోక్షం లభిస్తుందో లేదో వేచి చూద్దాం..!